క్లుప్తంగా

ముచ్చుమిల్లిలో పశు వైద్య శిబిరం

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం పట్టణంలోని ముచ్చుమిల్లిలో 17, 18 వార్డుల్లో శుక్రవారం మండల పశు వైద్యాధికారి డాక్టర్ మేడిశెట్టి కృష్ణార్జున ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం జరిగింది. ఇందులో 46 మంది రైతులకు చెందిన 92 పశువులకు వైద్య సేవలందించారు. పశువులకు రామచంద్రపురం ఏడీ ఓ.రామకృష్ణ గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. పశువుల్లో పాల దిగుబడి పెరుగుదలకు అవసరమైన కాల్షియం, మినరల్ మిక్చర్ తదితర పోషకాలను పాడి రైతులకు అందించారు. కార్యక్రమంలో వెల్ల పశు వైద్యాధికారి డాక్టర్ పి.రామచంద్రరావు, పశు వైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మండపేట: అర్తమూరులో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలో వేంకటేశ్వరుని మాలలు ధరించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. హోమం, వేద పారాయణం చేసి యాగశాల ప్రవేశం చేశారు. తాపేశ్వరం భక్తాంజనేయ స్వీట్స్ యజమాని దివంగత సలాది శ్రీను బాబు జ్ఞాపకార్థం 116 కేజీల లడ్డూ ప్రసాదాన్ని నైవేద్యంగా సమర్పించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మండపేట: రావులపేట వల్లూరివారివీధి వద్ద వ్యాన్ ఢీకొన్న ఘటనలో గాయపడిన పట్టణానికి చెందిన ఇంటి గోపీశేఖర్(43) కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఈ నెల 23న ఈ ప్రమాదం జరగ్గా, నందికోళ్ల సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

టన్నెల్.. అన్నదాత దిగాలు

- వయోభారంతో అక్విడెక్ట్
- శిథిలమైన వంతెన
- మూసుకుపోయిన తూములు
- పదివేల ఎకరాల్లో వరి సాగుకు సంకటం

కాజులూరు: వందల ఏళ్లుగా రైతులకు, ప్రజలకు సేవలందిస్తున్న పురాతన కట్టడం ప్రస్తుతం వయోభారంతో తల్లడిల్లుతోంది. రామచంద్రపురం, కరప, కాజులూరు మండలాల మీదుగా ప్రవహించే కూరాడ డ్రెయిన్ మండలంలోని తణుకువాడ, తాళ్లరేవు మండలం మట్లపాలెం వద్ద తుల్యభాగ డ్రెయిన్‌లో కలిసి సముద్రంలోకి చేరుతుంది. ఈ డ్రెయిన్‌పై మంజేరు, శలపాక మధ్య వందేళ్ల క్రితం బ్రిటిష్ పాలనలో అక్విడెక్ట్‌ను నిర్మించారు. కింద నుంచి డ్రెయినేజీ నీరు వెళ్లేందుకు ఆరుతూములతో డ్యామ్ ఏర్పాటు చేసి, శలపాక, తణుకువాడ, గొల్లపాలెం, డేగలపేటల్లోని పొలాలకు సాగునీరు చేరేందుకు పైభాగంలో ఒకవైపు నుంచి ఏఎంజీ కెనాల్ కాలువ నిర్మాణాన్ని, మరోవైపు మంజేరు గ్రామస్తులు శలపాక మీదుగా బయటి గ్రామానికి వచ్చేందుకు వీలుగా రహదారి మార్గాన్ని నిర్మించారు. ఈ మూడు భాగాలు కలిసిన ఈ కట్టడాన్ని స్థానికులు తనేలు అని పిలుస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ అక్విడెక్ట్ (తనేలు) శిథిలావస్థకు చేరింది. వంతెనకు ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు ధ్వంసమై, పంట కాలువలోకి, డ్రెయిన్‌లోకి పడిపోవడంతో వాహనాల రాకపోకలకు ప్రమాదభరితంగా మారింది. డ్రెయిన్‌లోని మురికినీరు ఇవతల నుంచి అవతలకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన



కూరాడ డ్రెయిన్‌పై మంజేరు వద్ద శిథిలావస్థలో ఉన్న అక్విడెక్ట్

తూములు పగుళ్లు తీసి, విరిగిపోవటంతో పాటు, మట్టితో పూడుకుపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. దీంతో డ్రెయిన్ వెంబడి ఉన్న కరప, కాజులూరు మండలాల్లోని సుమారు 10 వేల ఎకరాలు కొద్దిపాటి వర్షాలకే ముంపునకు గురవుతున్నాయి.

పొలాలకు ముంపు బెడద

వరదలు, భారీ వర్షాల సమయంలో స్థానికంగా కురిసే వర్షానికి తోడు, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు తూములు ముసుకుపోయిన కారణంగా ముందుకు వెళ్లే అవకాశం లేక, డ్రెయిన్ నుంచి పొలాల్లోకి చేరి ముంపునకు గురిచేస్తున్నాయి.

గత తొలకరిలో సంభవించిన ఫెంగల్ తుపానుకు రోజుల తరబడి నీరు పొలాల్లో నిలిచిపోవడంతో పంటకు తీవ్రనష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. గతంలోనూ తుపానుల వలన తమ ప్రాంతంలోని పొలాలు ముంపునకు గురవడానికి శిథిలావస్థలో ఉన్న ఈ అక్విడెక్ట్ ప్రధాన కారణమని రైతులు చెబుతున్నారు. మరోవైపు అక్విడెక్ట్ పైభాగాన ఉన్న కోరంగి కెనాల్‌కు తరచూ రంధ్రాలు పడుతుండడంతో, సాగునీరు డ్రెయిన్‌లోకి చేరి పొలాలకు సాగునీటి ఇబ్బందులు తలెత్తున్నాయని ఆయా ప్రాంతాల రైతులు వాపోతున్నారు.

జరగని పనులు

ఏటా వేసవిలో కాలువల మూసివేత సమయంలో అక్విడెక్ట్‌ను పునర్నిర్మిస్తామని గత కొన్నేళ్లుగా నాయకులు, అధికారులు ప్రకటనలు చేస్తున్నప్పటికీ, పనులు మాత్రం జరగటం లేదని రైతులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, శిథిలావస్థలో ఉన్న ఈ పురాతన కట్టడాన్ని తొలగించి, అధునాతన పద్ధతిలో అక్విడెక్ట్‌ను నిర్మించేలా చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

తూములు మూసుకుపోయాయి



అక్విడెక్ట్ కింది భాగంలో డ్రెయిన్‌కు ఉన్న ఆరు తూములు మూసుకుపోయాయి. దీంతో వర్షాలు వచ్చినప్పుడు పొలాల్లో నీరు నిలిచిపోతుంది. రోజుల తరబడి వరద నీరు పొలాల్లో ఉండిపోవటంతో పంట కుళ్లిపోయి తీవ్రంగా నష్టపోతున్నాం.

– చిర్ల వెంకటరెడ్డి, రైతు, మొగలిపాలెం

సాగునీటికి తప్పని ఇబ్బందులు



అక్విడెక్ట్ పైభాగం నుంచి ఉన్న కోరంగి కెనాల్‌కు తరచూ రంధ్రాలు ఏర్పడి, సాగు నీరు వృథాగా పోతుంది. నీటి ఎద్దడి సమయాల్లో కోరంగి కెనాల్ కాలువ శివారు భూముల్లో ఉన్న శలపాక, తణుకువాడ, గొల్లపాలెంల్లో పొలాలకు సాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

– గొవాల కామరాజు, రైతు, గొల్లపాలెం

రేపు ఉచిత వైద్య శిబిరం

మండపేట: సంతానలేమితో బాధపడుతున్న వారికి ఊరట కల్పించేందుకు మండపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మార్చి 2న ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. స్థానిక సత్యశ్రీ రోడ్డులోని లయన్స్ క్లబ్ భవనంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకూ ఈ శిబిరం ఉంటుందని క్లబ్ సభ్యులు, ప్రాజెక్ట్ చైర్మన్ చక్కా రాంబాబు తెలిపారు. సంతాన సాఫల్యంలో అత్యధిక సక్సెస్ రేట్ కలిగిన అనపర్తి సీడీఆర్ హాస్పిటల్‌కు చెందిన ఐవీఎఫ్ విభాగ నిపుణులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ కె.బాంధవి, డాక్టర్ ఆశా నిర్మల, డాక్టర్ అరుణదేవి వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. సంతాన సమస్యలతో బాధపడుతున్న దంపతులకు అవసరమైన వైద్య సేవలు ఉచితంగా అందిస్తారన్నారు. డాక్టర్స్ కన్సల్టేషన్, ఫర్టిలిటీ 3ఈ స్కానింగ్ ఉచితంగా అందించడంతో పాటు, రాయితీపై ల్యాబ్ పరీక్షలు చేస్తారని వివరించారు. రిజిస్ట్రేషన్ కోసం 97381 34567 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పలువురికి పట్టాభి పరామర్శ

కపిలేశ్వరపురం: పితృ వియోగంతో బాధపడుతున్న పడమర ఖండ్రిక గ్రామానికి చెందిన తోరాటి బాబులును, మాతృ వియోగంతో బాధపడుతున్న నల్లూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ ముత్యాల నారాయణరావును వైఎస్సార్ సీపీ నాయకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి గురువారం పరామర్శించారు. మండపేట మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ నక్కా సింహాచలం, ఇతర పార్టీ నాయకులతో కలిసి వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఆయన వెంట ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

రాయవరం: ఇంటర్ పరీక్షలకు రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ డి.నాగేశ్వరరెడ్డి శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఇంటర్ పరీక్షల్లో భాగంగా శనివారం ఫస్టియర్, సోమవారం సెకండియర్ పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8.30కే పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు హాల్ టిక్కెట్లతో చేరుకోవాలని సూచించారు. ఫస్టియర్ 259 మంది పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో పాటు, విజ్ఞాన్ కళాశాల విద్యార్థులు ఇక్కడ పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా తాగు నీరు, ఇతర సదుపాయాలు కల్పించామన్నారు.

నిత్య జీవితంలో శాస్త్రీయ పరిశోధనలు భాగం కావాలి

డీఈఓ సలీం బాషా

కపిలేశ్వరపురం: ఆధునిక విద్యార్థులకు శాస్త్రీయ ఆలోచనలు, పరిశోధనలు నిత్య జీవితంలో భాగం కావాలని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం బాషా అన్నారు. మండలంలోని మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. సీవీ రామన్, అబ్దుల్ కలామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులు రూపొందించిన శాస్త్రీయ పరిశోధనలను ఆయన పరిశీలించారు. పరిశోధన అంశాలను ఆసక్తిగా విద్యార్థుల నుంచి ఆలకించారు. అనంతరం సలీం బాషా మాట్లాడుతూ, సీవీ రామన్ ఆవిష్కరణలతో భౌతిక శాస్త్ర పరిశోధనల్లో భారతదేశానికి మంచి గుర్తింపు



మాచర హైస్కూల్‌లో విద్యార్థికి బహుమతి ఇస్తున్న డీఈఓ తదితరులు

దక్కిందన్నారు. మానవ వికాసానికి శాస్త్రీయ ఆలోచనలే ప్రామాణికమన్నారు. మారుతున్న కాలాన్ని, ప్రాపంచిక పరిస్థితులను అర్థం చేసుకునేందుకు సైన్స్ మార్గదర్శకమవుతుందన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థుల సంక్షేమ సంఘం నిర్వాహకులు ప్రొఫెసర్ గొడవర్తి భగవన్నారాయణ మాట్లాడుతూ, వికసిత్ భారత్ కోసం సైన్స్, నూతన ఆవిష్కరణలు చేయాల్సిన ఆవశ్యకతను, యువత పాత్రను వివరించారు. జిల్లా సైన్స్ అధికారి జీవీవీఎస్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, సైన్స్ ఆవిష్కరణలకు ఉన్న అవకాశాలను వివరించారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు డీఈఓ సలీంబాషా, ఎంపీడీఓ కె.రత్న కుమారి, ప్రొఫెసర్ భగవన్నారాయణ, హెచ్ఎం రమాదేవి బహుమతులు అందజేశారు. ఉత్తమ సేవలందిస్తున్న పాఠశాల సోషల్ ఉపాధ్యాయుడు రాజశేఖరాన్ని సత్కరించారు. కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి పిల్లి రాంబాబు, డాక్టర్ రాకేష్, ఎస్ఎంసీ అధ్యక్షుడు కె.భీమేశ్వరరావు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా కామన



మండపేట: ఏఐసీసీ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కామన ప్రభాకరరావు పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు. శుక్రవారం ఏడిద రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. మహా శివరాత్రి నాడు ఏఐసీసీ నుంచి ఈ మేరకు ఆదేశాలు వెలువడ్డాయని చెప్పారు. పార్టీలో 40 ఏళ్లుగా ఎన్నో పదవులు చేపట్టానన్నారు. అధిష్టానం తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిందని, దీనిని వమ్ము చేయకుండా రైతుల కోసం, పార్టీ పూర్వవైభవానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. పార్టీ అగ్ర నేతలకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో నాయకులు పీవీవీ సత్యనారాయణ చౌదరి, మగ్గం జాకబ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సయ్యద్ షాబాజ్ బాబా గంధోత్సవం

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో హజరత్ సయ్యద్ షాబాజ్ ఔలియా బాబా గంధోత్సవం(ఉర్స్) శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గా ముతవల్లి ఇంటి నుంచి ఫకీర్ల మేళాతో దర్గా వరకు బాబావారి గంధం, జెండా ఊరేగింపు నిర్వహించారు. దర్గాలో బాబా



ద్రాక్షారామలో బాబా గంధం, జెండా ఊరేగిస్తున్న ముస్లింలు

మజార్‌కు గంధం పూసి, ఫాతెహా ఖానీ సమర్పించారు. మత గురువులు గులాం ముస్తఫా, తసదుఖ్ హుస్సేన్, ఎండీకే మౌలి, సయ్యద్ షానవాజ్, సయ్యద్ ఫాజిల్, షేక్ మస్తాన్‌వలి, నౌషద్ బాబు, అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

తాపీ మేస్త్రుల నూతన కార్యవర్గం ఏర్పాటు



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న సభ్యులు

మండపేట: పట్టణంలో తాపీ మేస్త్రుల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటైంది. సంఘానికి నూతన అధ్యక్షుడిగా లేగా సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆలమూరు రోడ్డులోని తాపీ మేస్త్రీ భవనం వద్ద శుక్రవారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా వంగా సత్తిబాబు, కార్యదర్శిగా నాయుడు రామ్మూర్తి, సహాయ కార్యదర్శిగా సుంకర శ్రీనివాస్, కోశాధికారిగా కర్కోటి రాంబాబు, గౌరవాధ్యక్షులుగా మెండు బాపిరాజు, షేక్ ఇబ్రహీం, గురుమళ్ల ఈశ్వరరావును ఎన్నుకున్నారు. పలువురు కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు.

టైలర్ల ఉపాధికి కష్టకాలం

కపిలేశ్వరపురం: వస్త్ర రంగంలో మారుతున్న ఆధునిక పోకడలకు ప్రస్తుతం టైలరింగ్ వృత్తి తట్టుకునే పరిస్థితులు కనుమరుగవుతున్నాయని, ఉపాధిని కోల్పోయే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని పలువురు టైలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని అంగరలో శుక్రవారం ఆది గణపతి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ డేను ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు చిట్టంరెడ్డి సోమేశ్వరరావు ఆధ్వర్యంలో టైలర్లు తొలుత కుట్టు మెషీన్ సృష్టికర్త విలియం హోవే చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం టైలర్ల సమస్యలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఇటీవల జిల్లా టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన జక్కంశెట్టి స్వామిని ఘనంగా సత్కరించారు. నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం టైలర్లను ఆదుకునే దిశగా కార్యక్రమాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షుడు లేగా సుబ్రహ్మణ్యం, నాయకులు పసలపూడి కృష్ణ, పితాని రామచంద్రరావు, పసలపూడి సర్వేశ్వరరావు, దొడ్డారపు సత్యమహేంద్ర ప్రసాద్, కొశ్చెట్టి సత్యనారాయణ, కందా చక్రవర్తి పాల్గొన్నారు.

ఫ్యాషన్ ప్రపంచానికి ఆద్యుడు

రాయవరం: ఫ్యాషన్ ప్రపంచానికి విలియం హోవే ఆద్యుడని టైలర్ల సంఘ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీహెచ్‌వీవీఎస్ఆర్ గోపాలకృష్ణ అన్నారు. మండలంలోని చెల్లూరులో శుక్రవారం టైలర్స్ డేను ఘనంగా నిర్వహించారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం సమీపంలో నిర్వహించిన కార్యక్రమంలో గోపాలకృష్ణ మాట్లాడుతూ, దర్జీలకు భుక్తిని ప్రసాదించిన విలియం హోవేను గొప్ప వ్యక్తిగా కొనియాడారు. సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు సురుమళ్ల భాస్కరరావు మాట్లాడుతూ, ప్రస్తుతం రెడీమేడ్ వస్త్ర ప్రపంచం కారణంగా టైలర్లు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. దర్జీలను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని టైలర్లు డిమాండ్ చేశారు. ప్రభుత్వం టైలర్ల సంక్షేమానికి చర్యలు



అంగరలో జక్కంశెట్టి స్వామిని సత్కరిస్తున్న టైలర్లు

తీసుకోవాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో తొలుత విలియమ్స్ హోవే చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ గ్రామ శాఖ అధ్యక్షుడు కోట వెంకటరమణ, నాయకులు బడిగంటి గోవిందరాజు, రాయుడు సత్తిబాబు, మొండి గంగరాజు, చింతలపూడి శ్రీనివాస్, పోలిశెట్టి నాగేశ్వరరావు, సత్తిరాజు పాల్గొన్నారు.

దర్జీలకు దైవం

మండపేట: దర్జీలకు దైవం లాంటి వారు విలియం హోవే అని మండపేట లేబర్ ఆఫీసర్ మల్లేశ్వరరావు అన్నారు. టైలర్స్ డే సందర్భంగా పట్టణ టైలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సంఘం పుంత రోడ్డులో సంఘ ప్రెసిడెంట్ రేకపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుట్టు మెషీన్ సృష్టికర్త విలియం హోవే చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టైలర్లకు కార్మిక శాఖ ద్వారా అందే సంక్షేమ ఫలాలను ఆయన వివరించారు. టైలర్లు బీమా కోసం ఈ-శ్రమ్ సభ్యత్వ నమోదు చేయించుకోవాలని కోరారు. సంఘ నాయకులు లింగవరపు శ్రీను, వింజరపు శ్రీనివాసరావు, బీరక సాంబశివరావు పాల్గొన్నారు.

కాజులూరు: గొల్లపాలెంలో టైలర్స్ డేను గ్రామ టైలర్ల సంఘ అధ్యక్షుడు నాలి కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. సంఘ మండల అధ్యక్షుడు ఉడతా గోపాలకృష్ణ విలియమ్స్ హోవే చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ, గత వైఎస్సార్ సీపీ పాలనలో జగనన్న చేదోడు పథకం ద్వారా ప్రతి టైలర్‌కు ఏటా రూ.10 వేల ఆర్థిక సాయం అందేదన్నారు. ప్రస్తుతం టైలర్లకు సరైన ప్రోత్సాహం లేక, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కూటమి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. సంఘ నాయకులు పిల్లి అప్పలకొండ, గోపి మురళీకృష్ణ పాల్గొన్నారు.



చెల్లూరులో విలియం హోవే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టైలర్లు



మండపేటలో టైలర్స్ డే సభలో మాట్లాడుతున్న లేబర్ ఆఫీసర్

కె.గంగవరం: ఛాయా సోమేశ్వర టైలర్స్ సంఘం ఆధ్వర్యంలో టైలర్స్ డే ఘనంగా నిర్వహించారు. అముజూరులో జరిగిన కార్యక్రమంలో విలియం హోవే చిత్రపటానికి నివాళులర్పించారు. మండలంలో సీనియర్ టైలర్ శీలామంతుల బాలాజీని సన్మానించారు. సొసైటీలకు గుర్తింపు ఇవ్వాలని, టైలర్లకు పింఛన్లు, సబ్సిడీపై టైలరింగ్ మెటీరియల్, షాపులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించాలని నాయకులు కోరారు.

సైన్స్‌పై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలి

కె.గంగవరం: మండలంలోని దంగేరు, కె.గంగవరం, సత్యవాడ, పామర్రు, కోటిపల్లి, కె.గంగవరం ఉన్నత పాఠశాల్లో శుక్రవారం సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏపీ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో జరిగిన ఈ దినోత్సవంలో ఆయా పాఠశాలల్లో క్విజ్ పోటీలు, సైన్స్ మోడల్స్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎంలు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలన్నారు. సైన్స్‌లో ప్రతిభ చూపితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. జిల్లా సైన్స్ అధికారి గిరిజన వెంకట సుబ్రహ్మణ్యం, హెచ్ఎంలు రాజు, పొడగట్లపల్లి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేథో వికాసానికి సైన్స్ దోహదం

రామచంద్రపురం: విద్యార్థుల మేథోవికాసానికి ప్రయోగాలు తోడ్పాటునిస్తాయని వీఎస్ఎం విద్యా సంస్థల వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ మూర్తి అన్నారు. డిగ్రీ అటానమస్ కళాశాల ప్రాంగణంలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్ఎన్ ఆలీ అన్సారీ నేతృత్వంలో ఫ్యూజన్ 2కే25 ఫెస్ట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రయోగాంశాలను తిలకించారు. 76 ప్రయోగాలు ప్రదర్శనకు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఏబీసీ మోడరన్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులు రూపొందించిన సైన్స్ ఆవిష్కరణలు పలువురిని ఆకట్టుకున్నాయి. తక్కువ వ్యవధిలో ప్రాజెక్టుల రూపకల్పన చేసిన విద్యార్థులను, గైడ్ టీచర్లను అకడమిక్ డైరెక్టర్ ఎ.రమాదేవి అభినందించారు. స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో ప్రిన్సిపాల్ కె.రాము ఆధ్వర్యంలో సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు.

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలోని శ్రీచైతన్య స్కూల్‌లో సైన్స్ డే సందర్భంగా ప్రిన్సిపాల్ లీలా వంశీకృష్ణ ఆధ్వర్యంలో సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. సంస్థ రీజినల్ ఇన్‌చార్జి ఎంవీఎల్ నరేష్ దీనిని ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన డ్రోన్, హ్యూమన్ ఫాలోయింగ్ కార్, రోబో, డ్రిప్ ఇరిగేషన్ మోడరన్ అగ్రికల్చర్, మైక్రోస్కోప్ మోడల్, వాటర్ హార్వెస్టింగ్, హైడ్రాలిక్ లిఫ్ట్, వాటర్ కంజర్వేషన్ సిస్టమ్, హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ స్టేషన్, బ్లడ్ టెస్ట్ తదితర ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రాజెక్టులకు బహుమతులు అందజేశారు.



కె.గంగవరంలో విద్యార్థుల ప్రాజెక్టును తిలకిస్తున్న ఉపాధ్యాయులు

శాస్త్రవేత్తలుగా ఎదగాలి

మండపేట: ప్రతి విద్యార్థి గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఎస్సై హరికోటి శాస్త్రి అన్నారు. సెయింట్ ఆన్స్ స్కూల్లో జరిగిన సైన్స్ డేలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థుల ప్రాజెక్టులను తిలకించారు.